## బాలికలు ధైర్యంగా చదువుకోవాలి

కోహీర్, అక్టోబర్ 18: బాలికలు ఎలాంటి భయం లేకుండా ధైర్యంగా చదువుకోవాలని జిల్లా శిశు సంరక్షణ అధికారి శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని దిగ్వాల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో బాలికలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికలను వేదింపులకు గురి చేస్తే పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేయించాలని ఇన్‌చార్జి హెచ్‌ఎం రవీందర్‌కు సూచించారు. బాలికలు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. బాలల హక్కులు, బాల్య వివాహాలు, బాల కార్మికులు, పోక్సో చట్టం, మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాల గురించి వివరించారు. సమావేశంలో శ్రీనివాస్, డాక్టర్ వసంతరాజు, చంద్రశేఖర్, ముజీబ్, జర్నప్ప పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

జహీరాబాద్, అక్టోబర్ 18: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జహీరాబాద్ మండల వ్యవసాయాధికారి లావణ్య హెచ్చరించారు. శుక్రవారం జహీరాబాద్ పట్టణంలోని ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లో విక్రయిస్తున్న విత్తనాల ప్యాకెట్లు, ఎరువులు, మందుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. దుకాణాల్లో విక్రయిస్తున్న మినుము, శనగ, మక్క విత్తనాల ప్యాకెట్ల నుంచి విత్తనాల శ్యాంపిల్స్ సేకరించి తీసి నాణ్యత కోసం హైదరాబాద్ విత్తనాల పరిశీలిన కేంద్రానికి పంపించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆమోదిత విత్తనాలు అమ్మాలని, రైతులకు పూర్తి వివరాలతో కూడిన రసీదు ఇవ్వాలని సూచించారు. గడువు ముగిసిన ఎరువులు, మందులు విక్రమించవద్దన్నారు. దుకాణం ఎదుట స్టాక్, ధరలు, విత్తనాల వివరాలను తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.

## వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

జహీరాబాద్, అక్టోబర్ 18: న్యాల్‌కల్ మండలంలోని ఖలీల్‌పూర్‌లో శుక్రవారం గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామంలోని గ్రామ దేవతల ఆలయాల ఆవరణలో ఉదయం ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమ పీఠాధిపతి దేవగిరి మహారాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. శనివారం ఉదయం గ్రామ దేవతలైన ఊరడమ్మ, లక్ష్మీదేవి, భూలక్ష్మి, పోచమ్మ, కేశమ్మ, నాగులు, బొడ్రాయి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

పుల్కల్, అక్టోబర్ 18: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల స్పెషల్ ఆఫీసర్ బాల్‌రాజ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని వంటశాల గదులను, మరుగుదొడ్లను పరిశీలించారు. ఎప్పటికప్పుడు పాఠశాల ఆవరణమంతా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఉపాధ్యాయులు పద్మాబాయి, మంజుల, వార్డెన్ మాణయ్య ఉన్నారు.

## రేపు ఉమ్మడి జిల్లా ఖోఖో జట్టు ఎంపిక

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 18: ఉమ్మడి జిల్లా ఖోఖో జూనియర్స్ ఎంపికను ఈ నెల 20న నర్సాపూర్ టీటీడబ్ల్యూఆర్ఎస్‌లో నిర్వహించనున్నట్టు ఉమ్మడి జిల్లా అడ్‌హక్ కమిటీ కన్వీనర్ మహేందర్ రావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 నుంచి 30 వరకు మహబూబ్‌నగర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల 43వ జూనియర్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే ఉమ్మడి మెదక్ జిల్లా బాల బాలికల విభాగంలో ఎంపికలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు 2024 నవంబర్ 22 వరకు 18 సంవత్సరాల లోపు ఉండాలని, 2006 నవంబర్ 22న, ఆ తర్వాత జన్మించి ఉండాలని, వయస్సు, ఎత్తు, బరువు కలిపి 250 పాయింట్లకు మించరాదన్నారు. వివరాలకు 98665 46563, 94406 99225 నంబర్లపై సంప్రదించాలన్నారు.

## వసతి గృహాల తనిఖీ

ఝరాసంగం, అక్టోబర్ 18 : మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాలను సాంఘిక సంక్షేమ సహాయ అధికారి శ్రీనివాస్ శక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లోని సౌకర్యాలు, ఆహార నాణ్యత, పరిశుభ్రతను పరిశీలించారు. మెనూ సక్రమంగా అమలవుతున్నదా, లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని అధికారులకు సూచించారు. అనంతరం కార్యాలయాలకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. వార్డెన్లు చంద్రమ్మ, వెంకటేశ్ ఉన్నారు.

# ప్రజలను మభ్యపెట్టేందుకే కాంగ్రెస్ నాటకం

- గిరిజనుల భూములు లాక్కోడం సరైంది కాదు
- చిత్తశుద్ధి ఉంటే అసైన్డ్ కాని భూముల్లో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మించాలి
- వాసర్‌లో మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి


వాసర్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

సిర్గాపూర్, అక్టోబర్ 18: 'ప్రభుత్వం నుంచి ఎన్ని కోట్లు మంజూరయ్యాయి.. మీ జీవో ఎక్కడ.. మీకే సరిగ్గా తెలియదు.. కానీ, ఇంటిగ్రేటెడ్ రిసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన చేశారు' అని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి మంత్రి దామోదరపై ఫైర్ అయ్యారు. శుక్రవారం సిర్గాపూర్ మండలం వాసర్‌ను సందర్శించిన ఆయన స్థానిక గిరిజనులు, మాజీ ప్రజాప్రతినిధులను కలిసి మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ప్రజలను మభ్య పెట్టేందుకు మంత్రి స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ కలిసి నాటకం ఆడుతున్నారని ఆరోపించారు. వాసర్ శివారులోని 25 ఎకరాల అసైన్డ్ గిరిజన భూములను సమీకృత రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి తీసుకోవడంపై మండి పడ్డారు. ఇక్కడి శివారులో 200 ఎకరాలకు పైచీలుకు అసైన్డ్ భూములు ఉన్నాయని, అందులో స్థానిక గిరిజనులకు సంబంధించి 25 ఎకరాలు భూమిని లాక్కోవడం ధర్మామా.. అని ప్రశ్నించారు. పేద లంబాడీల భూముల్లోకి రావడం పద్ధతి కాదన్నారు. కాంగ్రెస్ పాలకులకు చిత్తశుద్ధి ఉంటే అసైన్డ్ లేని భూముల్లో సమీకృత పాఠశాల నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతానికి సమీకృత పాఠశాలను ప్రభుత్వం మంజూరు చేయడాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. 50 ఏళ్లలో చేయని అభివృద్ధిని ఖేడ్‌లో తాను ఏడేళ్లలో చేశానని చెప్పారు. ఇప్పటికే బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలకు సొంత భవనాల నిర్మాణానికి స్థలాలు ఉన్నాయి. వాటికి నిధులు మంజూరు చేసి భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఇవ్వాల్సిన ఫిజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని, గురుకులాల్లో సదుపాయాలు కల్పించాలన్నారు. స్థానిక మాజీ ఎంపీటీసీ పుండ్లిక్, మాజీ సర్పంచ్ జగ్గురాం, నాయకులు రఫియోద్దీన్, పోలీసుపాటేల్ శివాజీరావు, రమేశ్, రాజు, కిషన్ ఉన్నారు.

## బస్ సర్వీస్ ప్రారంభం


బస్సును ప్రారంభిస్తున్న అధికారులు

జహీరాబాద్, అక్టోబర్ 18: జహీరాబాద్ డిపో నుంచి మొగుడంపల్లి మండలంలోని పలు గ్రామాల మీదుగా ఔరంగ్‌నగర్ వరకు బస్సు సర్వీసును శుక్రవారం ప్రారంభించడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. చాలా రోజులుగా జహీరాబాద్ నుంచి మొగుడంపల్లి-ఔరంగనగర్ వరకు 13 గ్రా మాలకు బస్సు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ఫలితంగా ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి వ చ్చింది. ఈ విషయాన్ని సెట్విన్ కార్పొరేషర్ రాష్ట్ర చైర్మన్ గిరిదర్‌రెడ్డి దృష్టికి ఆయా గ్రామా ల ప్రజలు తీసుకెళ్లారు. దీంతో ఆయన స ంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆయా గ్రామాలకు బస్సు సర్వీసు నడిపించేందుకు చర్యలు తీసుకున్నారు. అధికారులు జహీరాబాద్ నుంచి మొగుడంపల్లి-ఔరంగ్‌నగర్‌కు బస్సు సర్వీసు ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో బస్సుకు గ్రామస్తులు ప్రత్యేక పూజ లు చేసి, కండక్టర్, డ్రైవర్‌ను సన్మానించారు. బస్సు సర్వీసు నడిపించేందుకు కృషి చేసిన సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్, ఆర్టీసీ అధికారులకు ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# సీసీ రోడ్ల పనుల పరిశీలన


సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

పటాన్‌చెరు, అక్టోబర్ 18: పటాన్‌చెరు పట్టణంలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ పరిశీలించారు. శుక్రవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సాయిరాంనగర్ కాలనీలో రూ.కోటీ 13 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించి కాంట్రాక్టర్‌కు నాణ్యత విషయంలో రాజీపడవద్దని సూచించారు. నాలుగు కాలాలు మన్నేలా రోడ్డు వేయాలని పేర్కొన్నారు. అనంతరం కటికే బస్తీలోని గౌస్ ఏపాక్ దర్గా వద్ద ఈ నెల 24, 25న గ్యార్మి పండుగ జరుపుతున్నందుకు అక్కడ పారిశుధ్య పనులు చేయాలని స్థానికులు కోరారు. స్పందించిన కార్పొరేటర్ పారిశుధ్య పనులు చేయిస్తామని అప్పటికప్పుడు జీహెచ్‌ఎంసీ పారిశుధ్య కమిటీకి ఆదేశాలిచ్చారు.

# అంత్యక్రియలకు తక్షణసాయం

బొల్లారం, అక్టోబర్ 18: అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన క్రైస్తవుడి కుటుంబానికి సంఘ సేవకుడు ఆనంద కృష్ణారెడ్డి అండగా నిలిచారు. మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్‌కు చెందిన అనిల్(30) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందాడు. అతడికి ఇద్దరు కుమార్తెలు. పేద కుటుంబం కావడంతో స్థానికులు సంఘ సేవకుడు ఆనంద్ కృష్ణారెడ్డిని ఆశ్రయించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేలను తక్షణసాయంగా అందజేశారు. ఆపదలో అండగా నిలిచిన ఆనంద్ కృష్ణారెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు, కాలనీవాసులు ధన్యవాదాలు తెలిపారు.

# అయ్యప్ప స్వాముల మహా పాదయాత్ర


అయ్యప్ప స్వాములకు ఆర్థికసాయం అందజేసిన రెడ్డిశ్రీనివాస్‌రెడ్డి, పక్కన పాండురంగారెడ్డి

రామచంద్రాపురం, అక్టోబర్ 18: బీహెచ్ఈఎల్ అయ్యప్ప స్వామి ఆలయం నుంచి 'తత్వంశీ' ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున్న అయ్యప్ప స్వాములు శబరిమలకు మహా పాదయాత్రగా వెళ్లారు. అయ్యప్ప ఆలయంలో స్వాములు ఇరుముడి కట్టుకొని శబరిమల కొండకు పాదయాత్రగా బయలుదేరారు. ఈ పాదయాత్రలో కాంగ్రెస్ నాయకుడు రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని స్వాములకు తనవంతు సహాయంగా రూ.1లక్ష అందజేశారు. అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి పాదయాత్రలో పాల్గొని అయ్యప్ప స్వాములకు పాదయాత్రలో భోజనాల కోసం వంట సామగ్రిని సమకూర్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భెల్ నుంచి శబరిమల కొండకు స్వాములు మహాపాదయాత్రగా తరలివెళ్లడం గొప్పవిషయమని, పాదయాత్ర విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

# వైద్యుడి నిర్లక్ష్యంతో చిన్నారి మృతి!

**దవాఖాన ఎదుట కుటుంబీకుల బైఠాయింపు**


కల్హేర్ పీహెచ్‌సీ ఎదుట కుటుంబ సభ్యులు, గ్రామస్తులు


ఆరాధ్య (ఫైల్)

కల్హేర్, అక్టోబర్ 18: పాప మృతికి వైద్యుడే కారణమని, అతడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం కల్హేర్ పీహెచ్‌సీ ఎదుట బాధిత కుటుంబ సభ్యులు బైఠాయించారు. వానే తెలిపిన వివరాల ప్రకారం.. కల్హేర్ గ్రామానికి చెందిన కొక్కండ ఓంసాయి, అనితకు నాలుగేండ్ల క్రితం పెండ్లి జరిగింది. వీరికి రెండు నెలల పాప. అనిత పాపతోపాటు తల్లిగారిళ్లయిన రాంరెడ్డిపేట్‌లో ఉంటున్నది. పాప తక్కువ బరువుతో జన్మించడంతో బరువు పరీక్షించేందుకు దవాఖానకు రమ్మని చెప్పడంతో బుధవారం పాప ఆరాధ్యను తీసుకుని వచ్చింది. వైద్యుడు రోగులను పరీక్షిస్తూ కొద్ది సేపు ఆగమని చెప్పాడు. పాప ఎడ్వడంతో తల్లి పాలిచ్చింది. తర్వాత పరీక్షించిన వైద్యుడు అనిల్‌రెడ్డి పాప ఆరోగ్య పరిస్థితి విషమించిందని వెంటనే సంగారెడ్డి దవాఖానకు తీసుకెళ్లాలని రెఫర్ చేశాడు. కుటుంబ సభ్యులు వెంటనే అంబులెన్స్‌లో కామారెడ్డి జిల్లా బాన్సువాడ సర్కార్ దవాఖానకు తరలించగా వైద్యులు పరీక్షించి పాప మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో బాధితులు పాపను ఇంటికి తీసుకువచ్చి అంత్యక్రియలు చేశారు. వైద్యుడి నిర్లక్ష్యంతోనే పాప కల్హేర్ దవాఖానలోనే మృతి చెందిందని కుటుంబసభ్యులు, గ్రామస్తులు శుక్రవారం వైద్యుడిని ప్రశ్నించేందుకు దవాఖానకు వెళ్లగా వైద్యుడు అందుబాటులో లేడు. పాప మృతికి కారణమైన వైద్య సిబ్బందిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై వైద్యుడు అనిల్‌రెడ్డిని వివరణ అడిగేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

# పెండింగ్ వేతనాలు చెల్లించాలి


ఈఎస్ఐ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

రామచంద్రాపురం, అక్టోబర్ 18: ఈఎస్ఐ దవాఖానలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే ఇవ్వాలని సీఐటీయూ నాయకుడు నాయిని నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఈఎస్ఐ దవాఖానలో సీఐటీయూ ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ డాక్టర్ స్వాతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఎస్ఐ దవాఖానలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు 3, 4 నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికులకు పెండింగ్ వేతనాలను ఇవ్వాలని కాంట్రాక్టర్లకు లేబర్ కమిషనర్ సూచించినా ఈఎస్ఐ నుంచి డబ్బులు రిలీజ్ కాలేదన్నారు.

# మహా సభలను విజయవంతం చేయాలి


మహా సభల ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్

జహీరాబాద్, అక్టోబర్ 18: జహీరాబాద్ పట్టణంలోని శెట్కార్ ఫంక్షన్ హాలులో శని, ఆదివారాల్లో జరిగే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి జయరాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం జహీరాబాద్ పట్టణంలో జరిగే మహాసభల ఏర్పాట్లను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం జహీరాబాద్ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సీపీఎం నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం జరిగే బహిరంగ సభకు వివిధ ప్రాంతాలకు చెందిన సీపీఎం నాయకులు హాజరుకానున్నట్టు పేర్కొన్నారు. జిల్లా మహా సభలను ప్రజలు, కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ ప్రణాళికలను రూపొందిస్తామన్నారు. నాయకులు, కార్మికులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాంచందర్, మహిపాల్, మాణిక్యం, రాజిరెడ్డి, నరేశ్, మసి, రాజు, సూరి పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి


మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాస్

సిర్గాపూర్, అక్టోబర్ 18: సమయపాలనను విధిగా పాటించాలని నూతన ఉపాధ్యాయులకు ఎంఈవో నాగారం శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం సిర్గాపూర్‌లో వారితో సమావేశమై పలు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎఫ్ఆర్ఎస్ ద్వారా విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం వివరాలు ఎప్పటికప్పుడు సమాచారమివ్వాలన్నారు. ప్రాథమిక విద్యభ్యాసం మెరుగు పరిచేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని, విద్యార్థుల ప్రగతి కోసం ప్రయత్నించాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎం మంజులాదేశ్‌పాండే, వెంకటేశం, ఎంఐఎస్ స్వప్న, సీఆర్పీలు శివకుమార్, ప్రకాశ్‌రావు, క్రాంతి, సిబ్బంది ఉన్నారు.

# గ్రూప్-3 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

**కలెక్టర్ వల్లూరు క్రాంతి**


అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 18: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నవంబర్, డిసెంబర్ నెలల్లో నిర్వహించనున్న గ్రూప్-3 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతున్నామని కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. గ్రూప్-2, గ్రూప్-3 రాత పరీక్షలను పురస్కరించుకొని రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి శుక్రవారం కలెక్టర్, పోలీసు, నోడల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రూప్-3 పరీక్షకు 17 వేల మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. జిల్లాలో మొత్తం 49 పరీక్ష కేంద్రాలను గుర్తించడం జరిగిందన్నారు. ఇప్పటికే ఆయా కేంద్రాలను అధికారులు సందర్శించారని వెల్లడించారు. గ్రూప్-3 పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు, ఇతర మెటీరియల్‌ను కట్టుదిట్టమైన బందోబస్తు మధ్య భద్రపర్చేందుకు రెండు స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందించామని వివరించారు. త్వరలో స్ట్రాంగ్ రూమ్‌లకు సంబంధించిన వివరాలను తెలియజేస్తామన్నారు. పరీక్ష కేంద్రాల వివరాలను ఆన్‌లైన్ ద్వారా పంపిస్తామని చెప్పారు. ఎక్కువ సంఖ్యలో అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నందున అందుకు అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ మందిరానికి విరాళం


నిర్వాహకులకు శిఖరం, పూల డెకరేషన్‌ను అందజేస్తున్న దాత మఠం మల్లయ్యస్వామి

రాయికోడ్, అక్టోబర్ 18: మండల కేంద్రమైన రాయికోడ్‌లో నూతనంగా నిర్మిస్తున్న హనుమంతుడి ఆలయానికి శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన మఠం మల్లయ్యస్వామి శిఖరం, పూల డెకరేషన్‌ను నిర్వాహకులకు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అన్ని మతాలను గౌరవించాలన్నారు. ఆధ్యాత్మిక సేవలో ఎప్పుడూ ముందుంటానన్నారు. మందిరాల నిర్మాణానికి తన వంతు సాయం చేస్తానన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పటాన్‌చెరు, అక్టోబర్ 18: స్నేహితుడితోపాటు ప్రయాణిస్తున్న యువకుడు పటాన్‌చెరులో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. శుక్రవారం సీఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన కథనం ప్రకారం.. బీరంగూడలో నివసించే కొత్తపల్లి సాయివరుణ్‌రెడ్డి(24) మరో స్నేహితుడు వేణుగోపాల్‌రెడ్డితో కలిసి లక్డారం గ్రామంలో ఫంక్షన్ ఉండటంతో బీరంగూడ నుంచి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. పటాన్‌చెరు పట్టణంలో శివాజీ బొమ్మవద్ద రోడ్డుపై వాహనం అదుపుతప్పి కింద పడిపోయింది. బైక్ నడుపుతున్న సాయివరుణ్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. పటాన్‌చెరు ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. వేణుగోపాల్‌రెడ్డి తలకు ఇతర చోట్ల గాయాలు కావడంతో అనుపమ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. మృతుడి తండ్రి శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మునిపల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్పీ చెన్నూరి రూపేశ్

# ప్రజలకు అందుబాటులో ఉండాలి

**ఎస్పీ చెన్నూరి రూపేశ్**

మునిపల్లి, అక్టోబర్ 18: పోలీసులు ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని ఎస్పీ చెన్నూరి రూపేశ్ అన్నారు. గురువారం రాత్రి మునిపల్లి గ్రామా న్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రౌడీ షీటర్లు, కేడీల వద్దకు వెళ్లి వారితో మాట్లాడారు. ప్రస్తుతం ఏం చేస్తున్నారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో చేసిన తప్పులను పునరావృతం కాకుండా సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. అనంతరం యువతతో మాట్లాడుతూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు గ్రామ పెద్దలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గంజా యి, నిషేధిత మాదక ద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని, గ్రామ రక్షణ, దొంగతనాల నివారణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీ సంజీవరావ్, మునిపల్లి ఎస్సై రాజేశ్‌నాయక్ ఉన్నారు.

# శుక్రవారం డ్రైడే తప్పక పాటించాలి


సత్వార్‌లో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ భిక్షపతి

జహీరాబాద్, అక్టోబర్ 18: ప్రతి శుక్రవారం డ్రైడేను తప్పక పాటించాలని జహీరాబాద్ ఏడీఏ, ప్రత్యేకాధికారి భిక్షపతి, జహీరాబాద్, న్యాల్‌కల్ ఎంపీడీఓలు మహేందర్‌రెడ్డి, రాజశేఖర్ అన్నారు. శుక్రవారం జహీరాబాద్ మండలంలోని సత్వార్, న్యాల్‌కల్ మండలంలోని అత్నూర్ గ్రామాల్లో అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని పలు వార్డులో పర్యటించి వ్యాధుల నివారణ, దోమలు, ఈగలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు. ఇంటి పరిసరాల్లో చెత్తాచెదరం, పిచ్చిమొక్కలను తొలిగించి శుభ్రం చేసుకోవాలన్నారు. గుంటలు, తొట్టెలు, పాత టైర్లు తదితర వాటిలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, నర్సరీలో మొక్కల పెంపకం పనులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సురేశ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ కమిటీలను రద్దు చేయాలి


న్యాల్‌కల్ ఎంపీడీవో రాజశేఖర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

జహీరాబాద్, అక్టోబర్ 18: న్యాల్‌కల్ మండలంలోని గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి సమాచారం లేకుండా ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కమిటీలను వెంటనే రద్దు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఓంకర్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు సంబంధించి ప్రజలకు ఎలాంటి సమాచారం లేకుండా ఏకపక్షంగా కమిటీలు ఏర్పాటు చేయడం తగదన్నారు. ఇందిరమ్మ కమిటీలో అధికార పార్టీలకు చెందిన నాయకులను ఎంపిక చేయడం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశం, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, నవీన్‌కుమార్, శివరాజ్, విష్ణువర్ధన్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

# కరెంటు షాక్‌తో బర్రెలు మృతి

జిన్నారం, అక్టోబర్ 18: మేత కోసం వెళ్లిన బర్రెలు ప్రమాదవశాత్తు కరెంటు షాక్ తగిలి మృతి చెందాయి. ఈ ఘటన వావిలాల గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన నందిగామ కృష్ణ, నందిగామ వీరేశ్, నందిగామ లక్ష్మికి చెందిన మూడు బర్రెలు గురువారం వావిలాల శివారులో మేతకు వెళ్లాయి. సాయంత్రం అయినా ఇంటికి తిరిగి రాలేదు. ఉదయం బాధితులు వెళ్లి పరిశీలించగా కరెంటు వైరు తగిలి మృతి చెంది ఉన్నాయి. కరెంటు షాక్‌తోనే బర్రెలు చనిపోయినట్లు బాధితులు వాపోయారు. ఒక్కో బర్రె విలువ రూ.లక్షా అరవై వేలకు పైగానే ఉంటుందని బాధితులు తెలిపారు. బర్రెలే జీవనాధారంగా బతుకుతున్నామని, సంబంధిత అధికారులు తమను ఆదుకోవాలని కోరారు.

**సిరిపురంలో గొర్రెలు..**

హత్నూర, అక్టోబర్ 18: విద్యుత్‌షాక్‌తో గొర్రెలు మృతి చెందిన ఘటన హత్నూర మండలం సిరిపురలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కాలె రాములుకు చెందిన రెండు గొర్రెలు ఇండ్ల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పక్క నుంచి వెళ్తుండగా ప్రమాదవశాత్తు కరెంటుషాక్‌తో మృతి చెందాయి. అధికారులు ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

గుమ్మడిదల, అక్టోబర్ 18: మనస్థాపానికి గురై ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహ్యాత చేసుకున్న ఘటన గుమ్మడిదలలో చోటుచేసుకుంది. ఎస్సై మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా తుప్రాన్ మండలం, మల్కాపూర్‌గ్రామానికి చెందిన వల్లపు రాజు(35) గుమ్మడిదల మండలం మంభాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మితో రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి రెండేండ్ల కుమారుడు ఉన్నాడు. కొంత కాలంగా ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. గుమ్మడిదలలో ఓ ఇంట్లో అద్దెకుంటున్నారు. శుక్రవారం మధ్యాహ్నం రాజు తన సోదరుడు మహేశ్‌కు ఫోన్ చేశాడు. తన మామ తనకున్న ట్రాక్టర్, బైక్ గుంజుకున్నాడని, పంచాయతీ పెట్టిస్తామని బెదిరించాడని చెప్పాడు. 3 గంటలకు తిరిగి మహేశ్‌కు మీ అన్న ఉరి వేసుకుని మృతి చెందాడని ఫోన్ వచ్చింది. వెంటనే రాజు తల్లి మల్లమ్మ, సోదరుడు వచ్చి చూడగా ఇంట్లో చీరెతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొని కనిపించాడు. తన కొడుకు మృతికి భార్య, మామనే కారకులని తల్లి మల్లమ్మ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


**SANGAREDDY DISTRICT TEACHING STAFF VACANCY POSITIONS**

| S. No. | Dist. | Name of the TGMR School & Junior College | Name of the Vacant Post Teaching |
|---|---|---|---|
| 1 | Sangareddy | TGMRS Andole Boys-1 | PGT Physical Science |
| 2 | | TGMRJC Andole Boys-1 | JL Economics |
| 3 | | TGMRS & JC Andole Girls-1 | PGT Physical Science |
| 4 | | TGMRS & JC Algole Girls-1 | JL Physics, TGT Telugu |
| 5 | | TGMRS Kohir Girls-1 | PGT Social |
| 6 | | TGMRS & JC Patancheru Girls-1 | TGT Social |

**Note:** Education Qualifications for PGT & JL Post: PG + B.Ed. & 2 years Experience mandatory. Education Qualifications for TGT Post: UG + B.Ed. & 2 years Experience mandatory. Submit all Certificates xerox with Resume before 19-10-2024 at TGMREIS Sangreddy B-1 located beside Sub-Registration Office, Kashipur (V), Kandi (M), Sangareddy (D). Contact: 7673917990, 9922337002.